రాజన్న సిరిసిల్ల జిల్లా తంగళ్లపల్లి మండల కేంద్రంలో లాండ్రీ షాప్ యాజమాని బండి శ్రీనివాస్‌తో కరచాలనం చేస్తూ ఓటు అభ్యర్థిస్తున్న మంత్రి కేటీఆర్

రాజన్న సిరిసిల్ల జిల్లా కేంద్రంలోని పద్మనాయక ఫంక్షన్‌హాల్‌లో నిర్వహించిన యువ ఆత్మీయ సమ్మేళనానికి పెద్ద ఎత్తున హాజరైన యువత

అభివృద్ధే నా కులం.. సంక్షేమమే నా మతం

కాంగ్రెస్, బీజేపీ 55 ఏండ్లు ఏమీ చేయలే

- ఓటుకు నోటు దొంగ రాష్ట్రానికి ముఖ్యమంత్రి అవుతాడా?
- బండి సంజయ్‌ది దొంగ డిగ్రీ
- మతం పేరుతో రెచ్చగొడుతున్నడు
- సిరిసిల్లలోనే రాజకీయ జన్మ
- ప్రతిపక్షాల దుష్ప్రచారాన్ని దీటుగా తిప్పికొట్టాలి
- యువ ఆత్మీయ సమ్మేళనంలో మంత్రి కే తారకరామారావు
- ఆత్మీయ సమ్మేళనం సక్సెస్.. జోష్‌లో యువత

> ఎన్నికల్లో మందు పోయను. పైసలు పంచను. తొమ్మిదిన్నరేండ్లలో చేసిన అభివృద్ధి మీ కండ్ల ముందు ఉన్నది. నేను పని చేస్తాననుకుంటే ప్రజలే నన్ను గెలిపించుకుంటారు. ఇష్టం లేకుంటే ఇంటికి తులం బంగారం ఇచ్చినా ఓడగొడతారు. సిరిసిల్ల ప్రజల ఆశీర్వాదంతో నాకంటూ ఓ గుర్తింపు వచ్చింది. ఇక్కడి ప్రజల రుణం తీర్చుకొనే బాధ్యత నాది.
>
> - మంత్రి కేటీఆర్

రాజన్న సిరిసిల్ల, అక్టోబర్ 27 (నమస్తే తెలంగాణ): అభివృద్ధే తన కులం, సంక్షేమమే తన మతం అని బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్, మంత్రి కే తారకరామారావు అన్నారు. కులం పేరుతో చేసే రాజకీయం కూడు పెట్టదని, మతం పేరుతో చేసే రాజకీయం మన మనుగడకే ప్రమాదమని హెచ్చరించారు. శుక్రవారం సిరిసిల్లలోని పద్మనాయక కల్యాణమంటపంలో బీఆర్ఎస్ పట్టణశాఖ ఆధ్వర్యంలో నిర్వహించిన యువ ఆత్మీయ సమ్మేళనానికి ముఖ్య అతిథిగా హాజరైన కేటీఆర్ ప్రసంగిస్తూ ప్రతిపక్షాలపై నిప్పులు చెరిగారు. ప్రపంచం మొత్తం చూస్తుండగా రూ.50లక్షల నోట్ల కట్టలతో అడ్డంగా దొరికిన ఓటుకు నోటు దొంగ రేవంత్‌రెడ్డి ముఖ్యమంత్రి అవుతాడా? ఆయన చేతిలో రాష్ట్రాన్ని పెట్టాలా? అని ప్రశ్నించారు. గ్యారంటీ వారంటీ అంటున్న ఆయన ఎప్పుడు బయట ఉంటడో, ఎప్పుడు జైలుకు పోతడో ఆయనకే గ్యారంటీ లేదని ఎద్దేవా చేశారు. కాంగ్రెస్ పార్టీ తెలంగాణ విషయంలో ఎన్నో తప్పులు చేసిందని చెప్పారు. 1968లో 378 మంది పిల్లలను కాల్చి చంపిందని, 1971లో తెలంగాణ ప్రజాసమితి ఎంపీలను బలవంతంగా కాంగ్రెస్‌లో చేర్చుకున్నదని ధ్వజమెత్తారు. కాంగ్రెస్, బీజేపీకి 55 ఏండ్లు అధికారమిస్తే తాగు, సాగు నీరు ఇచ్చేందుకు చేత కాలేదని, ప్రాజెక్టులు కట్టే తెలివి లేదని తీవ్రస్థాయిలో మండిపడ్డారు. సీఎం కేసీఆర్‌పై సోషల్ మీడియాలో ప్రతిపక్షాలు చేస్తున్న దుష్ప్రచారాన్ని తిప్పికొట్టాలని యువతకు పిలుపునిచ్చారు. ఇక్కడున్న ఎంపీ ఏం చేశాడని బండి సంజయ్‌ని నిలదీశారు. 'ఓ అభివృద్ధి, సంక్షేమం తెలియదు. ఓ కాలేజీ తెచ్చే ముఖం లేదు.. ఒక్క పరిశ్రమ తెచ్చే సోయిలేదు. ఆయనకు సదువు రాదు. దొంగ డిగ్రీ పెట్టుకుని ప్రజలను కులం, మతం పేరిట రెచ్చగొడుతున్నాడు' అని ఆగ్రహం వ్యక్తం చేశారు.

సిరిసిల్ల గురించి గర్వంగా చెప్పుకుంటా

'కలలో కూడా ఊహించిన అభివృద్ధి చేశా. ఎగువ, మధ్యమానేరు ప్రాజెక్టులతో మానేరు సజీవ జలధారగా మారింది. చీర్లవంచలో అతిపెద్ద అక్వాహబ్ ఏర్పాటు చేస్తున్నాం. స్థానిక యువతకే ఉపాధి కల్పిస్తాం. నాకు జన్మనిచ్చింది తల్లిదండ్రులైతే, రాజకీయంగా జన్మనిచ్చింది సిరిసిల్ల. ప్రపంచంలో ఎక్కడికి వెళ్లినా గర్వంగా చెప్పుకుంటా' అని కేటీఆర్ అన్నారు. నేతన్నలకు తాను అండగా ఉంటానని భరోసా ఇచ్చారు. అనంతరం మార్కండేయ ఆలయంలో పూజలు చేసి.. అక్కడ నూతనంగా నిర్మిస్తున్న మార్కండేయ భవ్య మందిర నిర్మాణ పనులను పరిశీలించారు. శ్రీ మార్కండేయ ఆలయాన్ని తీర్చిదిద్దుతామని చెప్పారు. ఆలయ పనుల పురోగతిపై స్థానిక పద్మశాలి సంఘం నాయకులను అడిగి తెలుసుకున్నారు. ఆలయ నిర్మాణ పనులు వేగవంతం చేయాలని సూచించారు. ఆలయానికి తన వంతు సహకారం అందిస్తానని తెలిపారు. కార్యక్రమంలో బీఆర్ఎస్ జిల్లా అధ్యక్షుడు తోట ఆగయ్య, పట్టణాధ్యక్షుడు జిందం చక్రపాణి, నాఫ్స్‌కాబ్ చైర్మన్ కొండూరి రవీందర్‌రావు, రాష్ట్ర నాయకుడు చీటి నర్సింగరావు, గ్రంథాలయ చైర్మన్ ఆకునూరి శంకరయ్య, సెస్ చైర్మన్ చిక్కాల రామారావు, టీపీటీడీసీ చైర్మన్ గూడూరి ప్రవీణ్, ఆర్‌బీఎస్ జిల్లా కన్వీనర్ గడ్డం నర్సయ్య, మున్సిపల్ వైస్‌పర్సన్ జిందం కళ, విద్యార్థి యువజన విభాగం నాయకులు, కౌన్సిలర్లు తదితరులు పాల్గొన్నారు.

యువ ఆత్మీయ సమ్మేళనం సక్సెస్

సిరిసిల్లలో బీఆర్ఎస్ పట్టణశాఖ ఆధ్వర్యంలో నిర్వహించిన యువ ఆత్మీయ సమ్మేళనం గ్రాండ్ సక్సెస్ అయ్యింది. పట్టణంలోని 39 వార్డుల యువకులు భారీగా తరలి వచ్చారు. దాదాపు 4 వేల మందికి పైగా బైక్‌లపై, నడుచుకుంటూ 2 కిలోమీటర్ల పాటు ర్యాలీగా సమ్మేళనానికి చేరుకున్నారు. ప్లకార్డులు చేత పట్టుకుని జై తెలంగాణ, జై కేటీఆర్, ఐకాన్ కేటీఆర్, సీఎం కేటీఆర్ అంటూ దారి పొడవునా నినదించారు.

నేడు ఎన్నారైలతో మంత్రి కేటీఆర్ వీడియో కాన్ఫరెన్స్

హైదరాబాద్, అక్టోబర్ 27 (నమస్తే తెలంగాణ): ప్రపంచవ్యాప్తంగా 52 దేశాల్లో ఉన్న బీఆర్ఎస్ ఎన్నారై శాఖల ప్రతినిధులతో శనివారం ఆ పార్టీ వర్కింగ్ ప్రెసిడెంట్, మంత్రి కేటీఆర్ వీడియో కాన్ఫరెన్స్ నిర్వహించనున్నారని బీఆర్ఎస్ ఎన్నారై గ్లోబల్ కోఆర్డినేటర్ మహేశ్ బిగాల తెలిపారు. నవంబర్ 30న జరిగే తెలంగాణ అసెంబ్లీ ఎన్నికల్లో సోషల్ మీడియా వేదికగా నిర్వహించాల్సిన క్యాంపెయిన్‌పై ఎన్నారైలకు మంత్రి కేటీఆర్ పలు సూచనలు చేస్తారని వెల్లడించారు. తమ పరిధిలోని కొన్ని నియోజకవర్గాలలో ఎన్నారైలు పర్యటించి సీఎం కేసీఆర్ తొమ్మిదిన్నరేండ్ల కాలంలో చేపట్టిన అభివృద్ధి, సంక్షేమ పథకాలపై ప్రచారం నిర్వహించనున్నారని పేర్కొన్నారు. ఈ నేపథ్యంలో ఎన్నారైలు అనుసరించాల్సిన వ్యూహంపై మంత్రి కేటీఆర్ దిశానిర్దేశం చేయనున్నారని మహేశ్ బిగాల తెలిపారు.

- బీఆర్ఎస్‌లో చేరిన ఎల్లారెడ్డి మాజీ ఎమ్మెల్యే

శుక్రవారం బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్, మంత్రి కేటీఆర్ సమక్షంలో గులాబీ గూటికి చేరిన ఎల్లారెడ్డి మాజీ ఎమ్మెల్యే బీ జనార్దన్‌గౌడ్. చిత్రంలో ఎంపీ బీబీ పాటిల్, ఎల్లారెడ్డి ఎమ్మెల్యే జాజుల సురేందర్, సీనియర్ నేత ప్రతాప్‌రెడ్డి

కపట వేషాల కాంగ్రెస్!

- లబ్ధిదారులను ముందే ఎంపిక చేస్తే పథకాన్ని ఆపాడ్డు
- 2009లోనే ఎన్నికల నిబంధనలకు కాంగ్రెస్ మార్పులు
- తాను అధికారంలో ఉన్నప్పుడు అనుకూలంగా సవరణలు
- ఇప్పుడు దాన్ని తుంగలో తొక్కుతూ రైతుబంధుపై ఫిర్యాదు

హైదరాబాద్, అక్టోబర్ 27 (నమస్తే తెలంగాణ): కాంగ్రెస్ పార్టీ అధికారంలో ఉంటే ఒక విధంగా.. ప్రతిపక్షంలో ఉంటే మరో విధంగా ప్రవర్తిస్తుందని మరోసారి నిరూపితమైంది. అధికారంలో ఉన్నప్పుడు తనకు అనుకూలంగా నిబంధనలను మార్చుకొని.. ఇప్పుడు అధికారం కోసం వాటిని తుంగలో తొక్కుతున్నది. అధికారం దక్కించుకోవాలనే తాపత్రయంలో కపట వేషాలు వేస్తున్నది. 2009 సార్వత్రిక ఎన్నికల సమయంలో కేంద్ర ఎన్నికల సంఘం ఎన్నికల నియమావళిలో కొన్ని మార్పులు చేసింది. కోడ్ అమల్లోకి వచ్చినా ఏయే పనులు, పథకాలను కొనసాగించవచ్చో స్పష్టంగా చెప్పింది. పైగా వీటిని కొనసాగించడానికి ప్రత్యేకంగా ఎన్నికల కమిషన్ అనుమతి తీసుకోవాల్సిన అవసరం లేదని స్పష్టం చేసింది.

1) అన్ని రకాల అనుమతులు పొంది అప్పటికే పనులు ప్రారంభమైన ప్రాజెక్టులను కొనసాగించవచ్చు.
2) ఎన్నికల కోడ్ అమల్లోకి వచ్చేనాటికే లబ్ధిదారులను ఎంపిక చేసిన పథకాలను కొనసాగించవచ్చు.

అని కేంద్ర ఎన్నికల సంఘం స్పష్టం చేసింది.

- అప్పుడు.. రాష్ట్రంలో, కేంద్రంలో అధికారంలో ఉన్నది కాంగ్రెస్ ప్రభుత్వమే. కేంద్ర ప్రభుత్వం సిఫారసు మేరకే ఎన్నికల సంఘం ఈ నిర్ణయాలను తీసుకున్నది. 2009 సార్వత్రిక ఎన్నికల్లో లబ్ధి కోసమే ఇలా నిబంధనలను మార్చిందనే విమర్శలు అప్పట్లో వినిపించాయి.
- ఇప్పుడు.. ప్రతిపక్షంలో ఉన్న కాంగ్రెస్ పార్టీ రైతుబంధును ఆపాలంటూ కేంద్ర ఎన్నికల సంఘానికి ఫిర్యాదు చేసింది. రైతుబంధు కొత్త పథకం కాదు. 11 దఫాలుగా ప్రభుత్వం నిరంతరంగా రైతులకు పెట్టుబడి సాయాన్ని అందజేస్తున్న సంగతి తెలిసిందే. ఆన్‌గోయింగ్ ప్రాజెక్టే అని తెలిసినా.. నిబంధనల ప్రకారమే ఉన్నదని తెలిసినా కాంగ్రెస్ ఫిర్యాదు చేసింది. దీంతో రైతుల మీద కాంగ్రెస్ కక్ష కట్టిందని విశ్లేషకులు మండిపడుతున్నారు.

రైతుల జీవితాలతో చెలగాటమా?

- ఓటమి భయంతోనే ఈసీకి కాంగ్రెస్ లేఖ
- మీడియాతో వ్యవసాయ మంత్రి నిరంజన్‌రెడ్డి

వనపర్తి, అక్టోబర్ 27 (నమస్తే తెలంగాణ): రాజకీయాల కోసం రైతుల జీవితాలతో చెలగాటం ఆడుతారా? అని వ్యవసాయ శాఖ మంత్రి సింగిరెడ్డి నిరంజన్‌రెడ్డి కాంగ్రెస్ నేతలపై మండిపడ్డారు. మట్టిని, కష్టాన్ని నమ్ముకుని సేద్యం చేస్తున్న కర్షకులకు సీఎం కేసీఆర్ రైతుబంధు అమలు చేస్తున్నారని, ఎన్ని ఆటంకాలు సృష్టించినా ఈ పథకం ఆగదని స్పష్టం చేశారు. శుక్రవారం ఆయన వనపర్తిలోని తన నివాసంలో మీడియాతో మాట్లాడారు. అసెంబ్లీ ఎన్నికల్లో ఓటమి భయంతోనే కాంగ్రెస్ నాయకులు రైతుబంధు పథకాన్ని నిలిపివేయాలని కేంద్ర ఎన్నికల కమిషన్‌కు లేఖ రాశారని విమర్శించారు. రైతుకు మేలు చేస్తున్న పథకం ఆపాలని హస్తం పార్టీ ప్రయత్నించడం అత్యంత దుర్మార్గమని అన్నారు. రైతుబంధు, రైతుబీమా పథకాలు ప్రపంచంలోనే ఎంతో ఆదరణ పొందాయని యూఎన్‌వో అనే సంస్థ నిర్ధారించిన విషయాన్ని గుర్తుచేశారు. అంతటి పథకాన్ని అడ్డుకోవాలని చూస్తే రైతుల ఆగ్రహానికి గురికాక తప్పదని హెచ్చరించారు. అన్నదాతలపై కాంగ్రెస్‌కు ఏనాడూ ప్రేమ లేదని, ఎన్నికలు రావడంతో ఇప్పుడు లేనిపోని ప్రేమను ఒలకబోస్తున్నదని ధ్వజమెత్తారు. కాంగ్రెస్ నాయకులు స్వార్థ రాజకీయాల కోసం ప్రజల బాగోగులు పట్టించుకోవడం లేదని విమర్శించారు. వచ్చే యాసంగిలో రైతుబంధు పడుతుందని, ఇందుకు అవసరమైన ఏర్పాట్లు చేశామని చెప్పారు. ఇప్పటివరకు 11 విడుతల్లో రూ.72,815 కోట్లను అన్నదాతల ఖాతాల్లో జమ చేసినట్టు తెలిపారు. ఎన్నికలొస్తే ధాన్యం కొనుగోళ్లను సైతం కాంగ్రెస్ నిలిపివేయాలని కోరుతుందేమోనని ఆయన అనుమానం వ్యక్తం చేశారు.కర్ణాటకలో అక్కడి కాంగ్రెస్ ప్రభుత్వం రైతులను గోస పెడుతున్నదని, ఈ విషయాన్ని అక్కడి రైతులే స్వయంగా వెల్లడిస్తున్నారని చెప్పారు. రైతులను అడ్డంపెట్టుకొని కాంగ్రెస్ పార్టీ రాజకీయం చేయాలని చూస్తున్నదని ఆగ్రహం వ్యక్తం చేశారు. రైతులు, ప్రజలు అప్రమత్తంగా ఉండాలని మంత్రి సూచించారు.

మంథని బీఆర్ఎస్ అభ్యర్థిపై దుష్ప్రచారం

- కాంగ్రెస్ అభ్యర్థి శ్రీధర్‌బాబు అండతో అడ్డగోలు ఆరోపణలు
- ఈ నెల 20న కేసు నమోదు

మంథని, అక్టోబర్ 27: పెద్దపల్లి జిల్లా మంథని నియోజకవర్గంలో ప్రజాస్వామ్యాన్ని కాంగ్రెస్ పార్టీ అపహాస్యం చేస్తున్నది. రాజకీయంగా బీఆర్ఎస్‌ను ఎదుర్కోలేక కాంగ్రెస్ అభ్యర్థి, స్థానిక ఎమ్మెల్యే శ్రీధర్‌బాబు అండతో ఆ పార్టీ కార్యకర్తలు సోషల్ మీడియాలో బీఆర్ఎస్ అభ్యర్థి పుట్ట మధూకర్‌పై దుష్ప్రచారానికి తెరలేపారు. బీఆర్ఎస్ నియోజకవర్గ ప్రచార కార్యదర్శి రఘువీర్ సింగ్ వీడియో ఆధారాలతో రిటర్నింగ్ అధికారికి ఈ నెల 20న ఫిర్యాదు చేశారు. దీంతో మంథని ఎస్సై కిరణ్‌కుమార్ ఎమ్మెల్యే శ్రీధర్‌బాబుపై ఐపీసీ 123(4) ఆఫ్ ఆర్‌పీ యాక్ట్ 1951, సెక్షన్ 171జీ, 505(బీ) కింద కేసు నమోదు చేసినట్టు ఆర్వో హనుమానాయక్ వెల్లడించారు.

బీజేపీకి అభ్యర్థులు కావలెను!

- సోషల్ మీడియాలో నెటిజన్ల సెటైర్లు
- ఒక్కరి పేరుతో బీజేపీ రెండో జాబితా
- సామాజిక మాధ్యమాల్లో ఇప్పుడిదే చర్చ

హైదరాబాద్ సిటీబ్యూరో, అక్టోబర్ 27 (నమస్తే తెలంగాణ): తెలంగాణలో పోటీ చేసేందుకు బీజేపీకి అభ్యర్థులు లేరంటూ జరుగుతున్న ప్రచారం నిజమేనని తేలిపోయింది. శుక్రవారం ఆ పార్టీ ఒకే ఒక్కరితో రెండో జాబితా ప్రకటించి ఈ ఊహాగానాలకు మరింత ఆజ్యం పోసింది. మాజీ ఎంపీ, బీజేపీ జాతీయ కార్యవర్గ సభ్యుడు జితేందర్‌రెడ్డి కుమారుడు మిథున్‌రెడ్డిని మహబూబ్‌నగర్ అభ్యర్థిగా ప్రకటిస్తూ రెండో జాబితాను విడుదల చేయడంపై నెటిజన్లు ఆటాడుకుంటున్నారు. ఒక్కడి పేరుతో ప్రత్యేక జాబితా ఏంటంటూ విమర్శల వర్షం కురిపిస్తున్నారు. తన కొడుకు కోసం మోదీ, అమిత్ షాను జితేందర్‌రెడ్డి అంత ప్రభావం చేయగలిగారా? అని కొత్త చర్చ లేవనెత్తారు. ఏది ఏమైనా కుమారుడికి సీటు ఇప్పించుకోవడం ద్వారా జితేందర్‌రెడ్డి తన పుత్ర ప్రేమను చాటుకున్నారని కొందరు అంటుంటే, డబ్బు, పలుకుబడి ఉంటే అవకాశాలు ఇలానే వస్తాయని మరికొందరు కామెంట్ చేస్తున్నారు. ఇతర పార్టీల నుంచి వచ్చే అభ్యర్థుల కోసం ఎదురుచూస్తే లిస్టులన్నీ ఒక్కొక్కరితోనే విడుదల చేసుకోవాల్సి వస్తుందని బీజేపీని ఎద్దేవా చేస్తున్నారు.

శుక్రవారం సూర్యాపేటలో బీజేపీ జనగర్జన సభలో అమిత్‌షా ప్రసంగిస్తున్న సమయంలో ఖాళీగా కనిపిస్తున్న కుర్చీలు

సూర్యాపేటలో అమిత్‌షా ఫ్లాప్‌షో

- జనం లేక వెలవెలబోయిన బీజేపీ సభ
- 30 వేల మంది అనుకుంటే.. 10 వేలు కూడా రాలే
- అమిత్‌షా మాట్లాడుతుండగానే వెళ్లిపోయిన జనం

సూర్యాపేట, అక్టోబర్ 27 (నమస్తే తెలంగాణ) : సూర్యాపేట జిల్లా కేంద్రంలో బీజేపీ శుక్రవారం నిర్వహించిన జన గర్జన సభ జనం లేక వెలవెలబోయింది. కేంద్ర హోంమంత్రి అమిత్ షా ముఖ్యఅతిథిగా హాజరైన ఈ సభ ఫ్లాప్‌షోగా మిగిలిపోయింది. 30 వేల మంది జనం వస్తారని, ఆ మేరకు కుర్చీలు ఏర్పాటు చేయగా.. పట్టుమని 10 వేల మంది కూడా రాలేదు. దాంతో ఆ పార్టీ నేతలు విస్తుపోయారు. అమిత్ షా, బీజేపీ సూర్యాపేట అసెంబ్లీ అభ్యర్థి సంకినేని వెంకటేశ్వర్‌రావు ఖాళీ కుర్చీలకే ప్రసంగం వినిపించాల్సి వచ్చింది. అమిత్‌షా మాట్లాడుతుండగానే జనం వెళ్లిపోవడం కనిపించింది. షెడ్యూల్ ప్రకారం అమిత్ షా ప్రసంగం 45 నిమిషాలు ఉండగా.. జనం లేకపోవడంతో 12 నిమిషాల్లోనే తన ప్రసంగాన్ని ముగించి వెళ్లిపోయారు. ఆయన ప్రసంగంలో కూడా పసలేదని, మొక్కుబడిగా సాగిందని బీజేపీ శ్రేణులు సైతం నిరుత్సాహం వ్యక్తం చేశాయి. సూర్యాపేట జిల్లాలోని నాలుగు నియోజకవర్గాల నుంచి జనాన్ని తరలించినా 10 వేలకు మించకపోవడంతో ఇలాంటి సభలు ఎందుకు పెడతారని ఆ పార్టీ అగ్ర నాయకులు ఆగ్రహం వ్యక్తం చేసినట్టు తెలిసింది.

- అలిపిరి నడక మార్గంలో మళ్లీ చిరుత, గుడ్డెలుగు



తిరుమల వెళ్లే అలిపిరి నడక మార్గంలో ఈ నెల 24 నుంచి 27 మధ్యలో శ్రీలక్ష్మీ నారాయణస్వామి ఆలయం, రివీటర్ మధ్య ప్రాంతంలో చిరుత, గుడ్డెలుగు తిరుగుతున్నట్టు కెమెరాలో రికార్డు అయిందని టీటీడీ తెలిపింది. కావున నడకదారి భక్తులు అప్రమత్తంగా ఉండాలని విజ్ఞప్తి చేసింది. భక్తులు గుంపులు, గుంపులుగానే వెళ్లాలని సూచించింది.

మానకొండూర్ బీజేపీలో కలకలం

- టికెట్ దక్కక పోవడంతో మనస్తాపం
- రాజీనామా చేసిన దళిత నేత గడ్డం నాగరాజు

తిమ్మాపూర్, అక్టోబర్ 27: కరీంనగర్ జిల్లా మానకొండూర్ నియోజకవర్గ బీజేపీ నేత రాజీనామా ఆ పార్టీలో కలకలం సృష్టించింది. దళిత నాయకుడు, నియోజకవర్గ ఇన్‌చార్జి గడ్డం నాగరాజు 32 ఏండ్లపాటు సొంత ఖర్చుతో పార్టీకి సేవలందించారు. పార్టీ పటిష్ఠత కోసం పని చేసినా టికెట్ దక్కక పోవడంతో మనస్తాపానికి గురయ్యారు. శుక్రవారం ఆయన రాష్ట్ర అధ్యక్షుడు కిషన్‌రెడ్డికి లేఖ రాయడం కలకలం రేపింది. మాజీ ఎమ్మెల్యే ఆరెపల్లి మోహన్‌ను పార్టీలో చేర్చుకోవడం బీజేపీ సిద్ధాంతాలకు విరుద్ధమని నాగరాజు తన లేఖలో పేర్కొన్నారు. తనను కాదని ఇటీవల పార్టీలో చేరిన ఆయనకు టికెట్ ఎలా ఇస్తారని ప్రశ్నించారు. అధిష్ఠానం తీరు నచ్చక పార్టీకి రాజీనామా చేస్తున్నట్టు ప్రకటించారు.

బీజేపీపై పోరుకు మాదిగలు సిద్ధం

ఓటుతో బుద్ధి చెపుతాం: వంగపల్లి

ఉప్పల్, అక్టోబర్ 27: మాదిగలను మోసం చేస్తున్న బీజేపీకి ఓటు ద్వారా బుద్ధి చెపుతామని ఎమ్మార్పీఎస్ రాష్ట్ర అధ్యక్షుడు వంగపల్లి శ్రీనివాస్ మాదిగ హెచ్చరించారు. అధికారంలోకి వచ్చిన వంద రోజుల్లో వర్గీకరణ చేస్తామని చెప్పి మాదిగలను మోసం చేసిన బీజేపీపై యుద్ధానికి సిద్ధంగా ఉన్నామని స్పష్టంచేశారు. శుక్రవారం హైదరాబాద్ హబ్సిగూడలోని ఓ హోటల్‌లో ఎమ్మార్పీఎస్ ముఖ్య కార్యకర్తల సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా వంగపల్లి మాట్లాడుతూ.. మాదిగలంతా ఏకతాటిపైకి రావాలని, బీజేపీకి ఈ ఎన్నికల్లో ఓటుతో సమాధానం చెప్పాలని పిలుపునిచ్చారు.కార్యక్రమంలో ఎమ్మార్పీఎస్ జాతీయ అధ్యక్షుడు మేడిపాపన్న, కోర్‌కమిటీ సభ్యులు కొండ్ర శంకర్, గుర్రాల శ్రీనివాస్, డాక్టర్ మల్లేశ్, పొట్టపెంజర రమేశ్, చింత బాబు, బాబురావు, నరసింహా, శ్రీనివాస్, మోహన్, రుక్మమ్మ, లక్ష్మి, వెంకట్, ప్రభాకర్, రాజారాం తదితరులు పాల్గొన్నారు.

ఎన్నారై ఝాన్సీలక్ష్మికి భారీ షాక్

- భారత పౌరసత్వం నిరాకరిస్తూ ఈ నెల 4న అధికారిక లేఖ
- అయినా పాలకుర్తిలో పోటీ చేస్తానంటూ ప్రకటన

హైదరాబాద్, అక్టోబర్ 27 (నమస్తే తెలంగాణ): పాలకుర్తిలో కాంగ్రెస్ అభ్యర్థిగా పోటీ చేస్తున్నానంటూ కొన్నాళ్లుగా హడావుడి చేస్తున్న ఎన్నారై హనుమాండ్ల ఝాన్సీలక్ష్మీరెడ్డికి షాక్ తగిలింది. భారత పౌరసత్వం కోసం ఆమె చేసుకున్న దరఖాస్తును కేంద్ర ప్రభుత్వం తిరస్కరించింది. అమెరికా పౌరురాలైన ఝాన్సీ.. తాను 2022 జూన్ 16 నుంచి భారత్‌లోనే నివాసం ఉంటున్నానని, తనకు భారత పౌరసత్వం ఇవ్వాలని ఇటీవల దరఖాస్తు చేసుకున్నారు. హైదరాబాద్‌లోని బంజారాహిల్స్ రోడ్ నంబర్ 12లో ఉంటున్నట్టు పేర్కొన్నారు. ఈ దరఖాస్తుపై విచారణ జరుపాలని కేంద్ర ప్రభుత్వం హైదరాబాద్ కలెక్టర్‌కు పంపింది. ఈ మేరకు విచారణలో ఝాన్సీలక్ష్మీరెడ్డి జూన్ 16 తర్వాత అమెరికా పాస్‌పోర్ట్‌తో పలుమార్లు ఆ దేశానికి వెళ్లి వచ్చినట్టు తేలింది. పౌరసత్వ నిబంధనల ప్రకారం ఎన్నారైలు కనీసం ఏడాదిపాటు భారత్‌లో నివాసం ఉండాలి. కానీ ఆమె పలుమార్లు అమెరికాకు వెళ్లారని, భారత్‌కు టూరిస్ట్‌గా వచ్చి వెళ్లినట్టు విచారణలో తేలింది. దీంతో దరఖాస్తును తిరస్కరిస్తున్నట్టు ఈ నెల 4న హైదరాబాద్ కలెక్టర్ లిఖితపూర్వకంగా రిజిస్టర్ పోస్టు ద్వారా ఝాన్సీకి పంపించారు. ఝాన్సీ వ్యవహారంపై పాలకుర్తిలో రాజకీయంగా తీవ్ర చర్చ జరుగుతున్నది. తప్పుడు సమాచారంతో భారత పౌరసత్వానికి దరఖాస్తు చేసుకున్నారని, అయినా అసెంబ్లీ ఎన్నికల్లో పోటీ చేస్తానంటూ ప్రచారం చేసుకున్నారని పలువురు మండిపడుతున్నారు. దరఖాస్తును ప్రభుత్వం తిరస్కరించిందని తెలిసినా, మాయ మాటలతో కాంగ్రెస్ నాయకత్వాన్ని, పార్టీ శ్రేణులను అయోమయానికి గురి చేశారంటూ ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు. ఇప్పటికే కాంగ్రెస్‌కే చెందిన ఎర్రంరెడ్డి తిరుపతి రెడ్డి, ఇతర నేతలు ఆమెకు పౌరసత్వం లేదని చెప్పినా వినకుండా తానే అభ్యర్థినని ప్రచారం చేసుకుంటూ ప్రజలను మభ్యపెట్టారని ధ్వజమెత్తుతున్నారు. మూడు నెలలుగా పాలకుర్తిలో ఝాన్సీ చేసిన హడావుడి, తాజా పరిణామాలతో నియోజకవర్గ పార్టీ శ్రేణులు అయోమయంలో పడ్డాయి.

కట్టుకున్నోళ్లను కడతేర్చిన 'కోరిక'

- భార్యను హతమార్చిన భర్త, భర్తను చంపించిన భార్య
- రెండు ఘటనలను ప్రమాదం, ఆత్మహత్యగా చిత్రీకరణ
- కేసులను ఛేదించిన సూర్యాపేట జిల్లా పోలీసులు

సూర్యాపేటలో మీడియాకు కేసు వివరాలు వెల్లడిస్తున్న ఎస్పీ రాహుల్ హెగ్డే

సూర్యాపేట సిటీ, అక్టోబర్ 27: ఇద్దరి వివాహేతర సంబంధం మరో ఇద్దరి ప్రాణాలను బలిగొన్నది.. రెండు కుటుంబాల్లో చీకట్లు నింపింది. వేరే మహిళతో సంబంధం పెట్టుకొని భార్యను చంపగా, ఆ మహిళ భర్తను చంపించింది. ఈ దారుణ ఘటనలు సూర్యాపేట జిల్లాలో చోటుచేసుకున్నాయి. వివరాల్లోకెళితే.. సూర్యాపేటలోని కుడకుడ భాగ్యనగర్ కాలనీకి చెందిన భూక్యా వెంకన్న, మోతె మండలం సిరికొండకు చెందిన అక్కనపల్లి శ్రీశైలం, నామవరానికి చెందిన సారగండ్ల మధు స్నేహితులు. కాగా, భూక్యా వెంకన్న షేక్ నస్రీన్‌తో వివాహేతర సంబంధం పెట్టుకోగా, ఇరువురి ఇండ్లల్లో ఈ విషయం తెలిసింది. దీంతో వెంకన్న తన భార్యను, నస్రీన్ తన భర్తను అడ్డుతొలగించుకొని కలిసి ఉండాలని నిర్ణయించుకున్నారు. గత జూలై 8న వెంకన్న, అతని భార్య రమాదేవి కలిసి వారి స్వగ్రామం బళ్లతండా నుంచి సూర్యాపేటకు బయల్దేరారు. మార్గమధ్యంలో భీమ్లాతండా-బండమీది చందుపట్ల గ్రామాల మధ్య బైక్‌ను ఆపి పథకం ప్రకారం భార్య తలను కరెంట్ స్తంభానికి బాది, కర్రతో కొట్టి చంపాడు. అనంతరం ప్రమాదం జరిగినట్టు చిత్రీకరించాడు. రెండ్రోజుల పాటు ప్రైవేటు దవాఖానలో కోమాలో ఉన్నట్టు నటించాడు. దీనిపై చివ్వెంల పోలీస్‌స్టేషన్‌లో రోడ్డు ప్రమాదం కేసు నమోదైంది. కొంతకాలానికి నస్రీన్ ఇంట్లోనూ గొడవలు ఎక్కువ కావడంతో తన భర్త రఫీని చంపాలని నిర్ణయించుకున్నది. అక్టోబర్ 9న రాత్రి సమయంలో నస్రీన్ తన భర్త వెళ్లాక వెంకన్నకు ఫోన్ చేసి చెప్పింది. భూక్యా వెంకన్న, అక్కనపల్లి శ్రీశైలం, సారగండ్ల మధు.. నస్రీన్ ఇంటికి వచ్చి తలుపు చాటున దాక్కొన్నారు. రఫీ ఇంట్లోకి రాగానే ముగ్గురూ కలిసి గొంతు నులిమి చంపేశారు. అనంతరం చీరెను రఫీ గొంతుకు కట్టి ఫ్యాన్‌కు ఉరేసి ఆత్మహత్యగా చిత్రీకరించారు. అయితే, రఫీ సోదరుడి ఫిర్యాదుతో భౌతికకాయానికి పోస్టుమార్టం చేయగా, హత్య చేసినట్టు తేలింది. నస్రీన్, వెంకన్నను అదుపులోకి తీసుకొని విచారించగా, రెండు హత్యల విషయాలు బయటపడ్డాయి. నలుగురు నిందితులను రిమాండ్‌కు తరలించి రెండు బైక్‌లు, నాలుగు సెల్‌ఫోన్లను పోలీసులు స్వాధీనం చేసుకున్నామని ఎస్పీ రాహుల్ హెగ్డే తెలిపారు. కేసును చేధించిన సూర్యాపేట పట్టణ ఇన్‌స్పెక్టర్ జీ రాజశేఖర్, ఎస్సైలు ఎస్కే యాకుబ్, రవీందర్, మహేంద్రనాథ్, ఇతర సిబ్బందిని అభినందించి రివార్డు ప్రకటించారు. మీడియా సమావేశంలో అదనపు ఎస్పీ ఎం నాగేశ్వర్‌రావు, డీఎస్పీ పీ నాగభూషణం పాల్గొన్నారు.